సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 31 । మార్చి । 2024



జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి

జగనన్నను గెలిపించి మరోసారి సీఎంను చేయాలన్న లక్ష్యంతో ప్రజలు ఉన్నారని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. IIలో



అటవీ సంరక్షణ అందరి బాధ్యత

అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ రాష్ట్ర ముఖ్య సంరక్షణ అధికారి చిరంజీవి చౌదరి అన్నారు. IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
పాడేరు, అరకు	6.13	4.36
రంపచోడవరం	6.27	4.41

న్యూస్‌రీల్

రేపటి నుంచి ధారాలమ్మ తల్లి ఉత్సవాలు

సీలేరు: ఘాట్‌రోడ్‌లో కొలువైన ధారాలమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అదే రోజు ఉదయం 9.15 గంటలకు ఉత్సవాలను ప్రారంభిస్తామని ఆలయ ఈవో సాంబశివరావు, కమిటీ సభ్యులు తెలిపారు. గర్భగుడిలోని తీసిన ఘటాలను గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ తీసుకువెళ్లి హారతులిస్తారని, కొత్త అమావాస్య నాడు అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

బీజేపీ, టీడీపీ అభ్యర్థులను ఓడిద్దాం

- పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నయ్యపడాల్ పిలుపు



మాట్లాడుతున్న బోనంగి చిన్నయ్యపడాల్

పాడేరు : బీజేపీతో పాటు దాని పల్లకీని మోస్తున్న టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా సీపీఎం పార్టీ పని చేస్తుందని.. ఈదిశగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. శనివారం పాడేరులో సీపీఎం పార్టీ జిల్లా నేత పాలికి లక్కు అధ్యక్షతన సీపీఎం పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగానికి బీజేపీ ప్రభుత్వం విలువ లేకుండా చేసిందని ఆరోపించారు. అందులో భాగంగానే జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దు చేసిందన్నారు. మళ్లీ దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే 1/70 చట్టాన్ని పూర్తిగా రద్దుకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం ఏం మంచి చేసిందని టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని ధ్వజమెత్తారు. కేవలం రాజకీయ అజెండా మాత్రమే ఆ మూడు పార్టీలకు ముఖ్యమని ప్రజల మనోభావాలు, సంక్షేమం ఆ పార్టీలకు పట్టదన్నారు. రానున్న ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తో పాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ, పల్లకిని మోస్తున్న టీడీపీ, జనసేన పార్టీల ఓటమిల లక్ష్యంగా సీపీఎం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎల్. సుందర్‌రావు, నాయకులు చిట్టిబాబు, బొజ్జన్న, ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో పీహెచ్‌సీ సందర్శన



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న పీవో

ఎటపాక: గౌరిదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల వివరాలను వైద్యాధికారి శ్రీదేవి నుంచి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనంలో నీటి సదుపాయం లేకపోవడంతో రోగులు, సిబ్బందికి ఇబ్బందిగా ఉందని పీవో దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి వరదల సమయంలో వరద ముంపునకు గురైన సమయాల్లో సామగ్రి,మందులను భవనంపైన భద్రపర్చుకునేందుకు ఓ గదిని నిర్మించాలని సిబ్బంది కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

విస్తృతంగా తనిఖీలు



పనసలపాలెం ప్రధాన రహదారిలో తనిఖీ చేస్తున్న పోలీసు బలగాలు

వై.రామవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని పనసలపాలెం నుంచి సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన రికార్డులు, డ్రైవింగు లైసెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. సక్రమంగా లేని వాహనాదారులపై కేసులు నమోదు చేశారు. ప్రధాన రహదారిలో తనికీలు చేపట్టారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

కూటమిలో కుమ్ములాట

- పాడేరు, అరకు టికెట్ల కేటాయింపులో సీనియర్లకు అన్యాయం
- పొత్తు ఎత్తుగడలతో టీడీపీకి చంద్రబాబు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని విమర్శ
- అమీతుమీ తేల్చుకుంటామని అసంతృప్తి నేతల హెచ్చరిక
- మరింత దిగజారుతున్న పార్టీ ప్రతిష్ట

జిల్లాలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారింది. టికెట్ల కేటాయింపులో అధిష్టానం వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తోంది. చంద్రబాబు పొత్తు ఎత్తుగడలతో సీనియర్లను పక్కనపెట్టడంతో వారంతో రగిలిపోతున్నారు. ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని వారు ధ్వజమెత్తుతున్నారు. తీరుమార్చుకోకుంటే ఈ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.



పాడేరు/అరకులోయ టౌన్: జిల్లాలోని పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో రాజకీయం వేడెక్కింది. అసెంబ్లీ టికెట్ కోసం కూటమిలోని టీడీపీ, బీజేపీ నేతల మధ్య కుమ్ములాట మొదలైంది. అరకులోయ సీటుకు టీడీపీ అభ్యర్థిగా సియారి దొన్నుదొరను చంద్రబాబు ఇదివరకే ప్రకటించడంతో ఆయన ఎప్పటి నుంచో ప్రచారం చేస్తున్నారు. ఇంతలో పాడేరు సీటు వద్దని, అరకు కావాలని చెప్పిన బీజేపీ అధిష్టానం పాంగి రాజారావును అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు కంగుతిన్నాయి. దీనిపై చంద్రబాబును ఫోన్లో సంప్రదించేందుకు దొన్నుదొర ప్రయత్నించినప్పటికీ స్పందన కరువైంది. ఎలాగైనా సీటు తనకే దక్కుతుందన్న ఆశతో దొన్నుదొర చంద్రబాబును కలిసేందుకు వెళ్లారు. ఇలా సీటు తనకే వస్తుందని ఆయన, కూటమి అభ్యర్థిని నేనేనంటూ పాంగి రాజారావు ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

పాడేరులోనూ అదే తీరు

పాడేరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొంది పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తనకే టికెట్ వస్తుందన్న ఆశతో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మరోపక్క ఆమెకు వ్యతిరేక వర్గంగా ముద్రపడిన మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, విజయరాణి, ఎంవీవీఎస్ ప్రసాద్, కొట్టగుళ్లి సుబ్బారావు కూడా పార్టీ టికెట్‌ను ఆశించారు. వీరెవ్వరికీ కాకుండా పార్టీలో మూడు నెలల క్రితం చేరిన కిల్లు రమేష్‌నాయుడుకు టికెట్ కేటాయిస్తూ టీడీపీ అధిష్టానం ప్రకటించడంతో కంగుతున్నారు. వీరంతా అధిష్టానం తీరుపై ధ్వజమెత్తుతూ రోడ్డెక్కారు. టికెట్ కేటాయింపు విషయంలో నిర్ణయం మార్చుకోకుంటే అభ్యర్థిని ఓడించి తీరుతామని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మరోవర్గానికి చెందిన మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి తదితరులు హెచ్చరించారు. దీంతో ఆ పార్టీ శ్రేణులకు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నాయి.

ముడుపులిస్తేనే సీటు: మాజీ మంత్రి మణికుమారి

మాజీ మంత్రి మణికుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అభ్యర్థిత్వాన్ని ఈ ఎన్నికల్లో పరిశీలించాలని టీడీపీ పెద్దలను కోరానని, అయితే డబ్బు ఎంత ఖర్చు పెట్టగలవు అని ప్రశ్నించారన్నారు. డబ్బు ఉంటేనే ఎన్నికల్లో గెలుస్తామని టీడీపీ పెద్దలు అనడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఆమె చేసిన వ్యాఖ్యలు టీడీపీలో సీనియర్లను కాదని సీట్ల కేటాయింపులో ఏమేర ముడుపులు డిమాండ్ చేస్తున్నారనే పరిస్థితులకు అద్దం పడుతోంది.

టీడీపీ అభ్యర్థి ఓటమే ధ్యేయం

- గిరిజనులంటే చంద్రబాబుకు చిన్నచూపు
- సభ్యత్వం లేని వ్యక్తికి ఏ ప్రాతిపదికన టికెట్ కేటాయించారు
- డబ్బులు ఇస్తేనే పార్టీ టికెట్లు
- ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఘాటు వ్యాఖ్యలు
- కన్నీరు పెడుతూ ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు : పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు ఓటమే ధ్యేయంగా తాను, పార్టీ శ్రేణులు, అనుచరులు పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి హెచ్చరించారు. పాడేరు పట్టణంలోని కుమ్మరిపుట్టు వద్ద తన నివాసంలో అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె కన్నీరుపెడుతూ పార్టీ అధిష్టానంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను 2017 నుంచి నేటి వరకు ఎన్నో అష్టకష్టాలు పడి పార్టీ ఉనికి కాపాడేందుకు కృషి చేశానన్నారు. అయితే టికెట్ కేటాయింపు విషయంలో పార్టీ తనను నిలువునా మోసం చేసిందన్నారు. మూడు నెలల క్రితం పార్టీ కండువా కప్పుకున్న వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఆయనకు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాడేరు మేజర్ పంచాయతీ ఎన్నికల్లో కిల్లు రమేష్‌నాయుడు తల్లి పోటీ చేస్తే నాల్గవ స్థానానికి పరిమితమై ఘోరంగా ఓటమి చెందారన్నారు. పార్టీలో ఏ సభ్యత్వం లేని వ్యక్తి, ఎన్నడూ పార్టీ జెండా పట్టుకోని వ్యక్తికి ఎలా టికెట్ కేటాయిస్తారని ధ్వజమెత్తారు. లాబీయింగ్ చేసి ఆర్థికంగా ఎంతోకొంత అందజేస్తేనే టీడీపీలో టికెట్లు కేటాయిస్తారని ఆమె పరోక్షంగా విమర్శించారు. పాడేరు అసెంబ్లీ టికెట్ పార్టీలో కొంతమంది వ్యక్తులు అమ్ముకున్న సంగతి చంద్రబాబుకు తెలియదా అని ఆమె ప్రశ్నించారు. గిరిజనులంటే చంద్రబాబుకు ఎందుకు చిన్న చూపు అని ప్రశ్నించారు. గిరిజనుల మనోభావాలను చంద్రబాబు ఎందుకు అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ కేటాయింపు వ్యవహారంలో పునరాలోచన చేసి తనకు కేటాయించాలని, లేకుంటే రమేష్‌నాయుడు ఓటమికి తామంతా కలిసి పని చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

అరకు ఉమ్మడి అభ్యర్థిని నేనే.. పాంగి రాజారావు



విలేకరులతో మాట్లాడుతున్న పాంగి రాజారావు, తదితరులు

అరకులోయ టౌన్: అరకు అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని తానేనని బీజేపీ నేత పాంగి రాజారావు తెలిపారు. శనివారం మండలంలోని పద్మాపురం పంచాయతీ, రణజిల్లెడ సమీపంలోని ఓ రిసార్ట్‌లో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలో నిలిపేమన్నారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారన్నారు. కొన్ని చోట్ల తమ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారని రాజారావు పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారులు కీలకం

- అప్రమత్తత అవసరం
- కలెక్టర్ విజయసునీత



హాజరైన జోనల్ అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత ఆదేశించారు. పాడేరు అసెంబ్లీ సెక్టోరల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై కలెక్టరేట్‌లో శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రి, ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల సిబ్బందికి సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చాల్సిన బాధ్యత సెక్టోరల్ అధికారులపై ఉందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను నియమిస్తున్నామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలుజేయాలని, ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సెక్టోరల్ అధికారులంతా వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్ల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లను సాంకేతిక కారణాలతో మార్చాల్సి ఉంటే ముందుగా మాక్ పోలింగ్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి,జేసీ భావన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సెక్టార్ అధికారులంతా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మావతి,ఎస్‌డీసీలు శర్మ,అంబేద్కర్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో డీఆర్వో..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి డీఆర్వో పద్మావతి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల ఏర్పాట్లు, మున్ముందు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేన్‌పవర్, మెటీరియల్, ఈవీఎం మేనేజ్‌మెంట్ ప్రక్రియలో చురుగ్గా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు తగిన నివేదికలు అందజేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, నోడల్ అధికారులు ఎం.శివయ్య, పి.గోవిందరాజులు, పి.రాములు, వెంకటరావు, అప్పారావు పాల్గొన్నారు.

భానుడు భగభగ

- నిర్మానుష్యంగా ప్రధానరోడ్లు, జంక్షన్లు
- చింతూరులో 41, పాడేరులో 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు



నిర్మానుష్యంగా ముంచంగిపుట్టు ప్రధాన రహదారి

సాక్షి, పాడేరు: వేసవి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. జిల్లా కేంద్రమైన పాడేరులో శనివారం ఉదయం 11గంటల నుంచి ఎండ తీవ్రత నెలకొంది. మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు తీవ్రత మరింత పెరగడంతో జనం అల్లాడిపోయారు. ప్రధాన జంక్షన్లు, మెయిన్‌రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. చింతూరులో 41డిగ్రీలు, పాడేరులో 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముంచంగిపుట్టు: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రతకు గిరిజనులు అల్లాడిపోయారు. చెట్ల నీడను సేద తీరుతూ ఉపశమనం పొందారు. శీతల పానీయాలను ఆశ్రయించారు.కొబ్బరి బొండాలు, పుచ్చకాయల అమ్మకాలు భారీగా జరిగాయి.

రేపటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- పాడేరు తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు



మూల్యాంకనం జరిగే పాడేరులోని తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాల

సాక్షి,పాడేరు: పట్టణంలోని తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం నుంచి టెన్త్ మూల్యాంకనం చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొత జిల్లాగా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఏడాది జిల్లా కేంద్రం పాడేరులో టెన్త్ మూల్యాంకనం నిర్వహించాలని కలెక్టర్ విజయసునీత నిర్ణయించారు. ఆమె ఆదేశాల మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఐదు సబ్జెక్టులకు సంబంధించి 80 వేల జవాబు పత్రాలను వచ్చేనెల 8వ తేదీ వరకు మూల్యాంకనం చేస్తారు. ఇందుకు 520 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ నియమించింది. పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తుంది. ఈ సందర్భంగా ఏర్పాట్లపై శనివారం జిలావిద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు శనివారం సమీక్షించారు. మూల్యాంకన విభాగం అధికారులు, ఇతర సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. వేసవి కావడంతో అన్ని గదులకు ఫ్యాన్లు, నిరంతరం విద్యుత్ సరఫరా, సురక్షిత తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

బలహీన వర్గాలంటే ఎందుకంత చిన్నచూపు

చంద్రబాబు విమర్శలపై సర్వత్రా నిరసన

రంపచోడవరం/ అనంతగిరి: వైఎస్సార్‌సీపీ శింగనమల అసెంబ్లీ టికెట్ టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు ఇవ్వడంపై చంద్రబాబు చేసిన విమర్శల పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఉన్నత విద్య అభ్యసించిన వీరాంజనేయులు చంద్రబాబు హయాంలో ఉద్యోగం రాకపోవడంతోనే టిప్పర్ డ్రైవర్‌గా మారాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చులకన భావం తగదు



చంద్రబాబుకు బలహీన వర్గాల ప్రజలంటే చులకన. వారు ఎప్పుడు రాజకీయంగా ఎదగకూడదనే ధోరణితో ఉంటారు. జగనన్న టిప్పర్ డ్రైవర్‌కు అసెంబ్లీ సీటు ఇవ్వడాన్ని ఆయన ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన దిగజారుడు రాజకీయాలకు స్వస్తి పలకాలి.

– ఎం నాగేశ్వరరావు, ఆటో డ్రైవర్, రంపచోడవరం

మా సత్తా ఏంటో చూపిస్తాం



లారీ డ్రైవర్లు అసెంబ్లీ వెళ్లకూడదా.. చంద్రబాబు వ్యాఖ్యలు డ్రైవర్లలంతా తీవ్రంగా ఖండిస్తున్నాం. మమ్మల్ని ఆయన ఎందుకంత చులకనగా చూస్తున్నారు. మాకు ఆత్మాభిమానం ఉంది. కష్టపడి బతుకుతున్నాం. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు మా సత్తా ఏంటో చూపిస్తాం.

– ముక్కి సొంబ, మోటార్ యానియన్ మాజీ అధ్యక్షుడు, అరకువేలి

మేమున్నామని..

మావోయిస్టుల ప్రభావంతో బిక్కుబిక్కుమని జీవనం సాగించే గాదిగుంట ఆదివాసీ గ్రామ గిరిజనులకు మేమున్నామంటూ పోలీసులు భరోసా కల్పించారు. మౌలిక వసతులు కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ చేరువయ్యారు.

- మావోయిస్టు కోటలో పోలీసుల సేవలు
- గాదిగుంటలో ప్రగతి పూలు



సీఆర్‌పీఎఫ్ సీ/198 బెటాలియన్ పోలీసులు సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాల భవనం



ఆదివాసీ గిరిజన మహిళతో పాఠశాల భవనాన్ని ప్రారంభింపజేస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)



గాదిగుంటలో గిరి యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న నుర్మతి డీఎస్పీ ఉదయ్‌కుమార్



పాఠశాలకు సమకూర్చిన సామగ్రితో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు

జి.మాడుగుల: ఒకప్పుడు గాదిగుంట ఆదివాసీ గ్రామం మావోయిస్టులకు అడ్డా.. అక్కడికి వెళ్లాలంటే భయపడాల్సి వచ్చేది. ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందనే భయం.. ఈ కారణంగా అధికారులు ఆ గ్రామంవైపు కన్నెత్తి చూసేవారు కాదు. ఫలితంగా ప్రభుత్వ పరంగా ఎటువంటి ప్రయోజనం అక్కడి గిరిజనులకు దక్కేది కాదు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నం. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో అవుట్ పోస్టు పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేశాయి. ప్రజలకు సేవలందించడం, వారికి రక్షణగా ఉండటమే కాకుండా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా భద్రత చర్యలు చేపట్టాయి. దీంతో రాను రాను మావోయిస్టుల ప్రభావం తగ్గింది. ఇప్పుడు ఈ గ్రామంలో ప్రగతి పూలు వికసిస్తున్నాయి. రోడ్లు తదితర మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. సీఆర్‌పీఎఫ్ సీ/198బెటాలియన్ ఐజీ చారుశీల, కమాండెంట్ రాజేష్ పాండే, అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌కుమార్, జి.మాడుగుల సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్ గ్రామాన్ని దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టారు. గిరిజనుల అభ్యర్థన మేరకు నుర్మతి వద్ద పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుచేశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం, సురక్షిత తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, క్రీడా సామగ్రి అందజేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను సమకూర్చారు. పాఠశాల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. ఏ కష్టమొచ్చినా మేమున్నాంటూ గ్రామ గిరిజనులకు పోలీసులు భరోసా కల్పించారు.

ఆదివారం.. విద్యుత్ బిల్లుల స్వీకరణ

పాడేరు : ఏపీఈపీడీసీఎల్ పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ శాఖ కార్యాలయాల్లో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించుకునేందుకు వినియోగదారులకు అవకాశం కల్పించినట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. ఆ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

అరకులోయరూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని లిట్టిగూడ గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీ ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని గ్రామాల్లో పర్యటించి, ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పర్యటనలో భాగంగా

అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ అరుణకుమారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై అడిగితెలుసుకున్నారు.పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, సర్పంచులు భాస్కరరావు, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, డైరెక్టర్ గోపాల్, నాయకులు సంపత్‌కుమార్, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.


లిట్టిగూడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


పెదశీతనపల్లిలో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అడుగుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

చింతూరు: గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పేదల బతుకులను ఎంతగానో మార్చిందని, పేదలను ఆర్థికంగా ఆదుకుని మనోధైర్యం కలిగించిందని ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. శనివారం ఆయన చింతూరు మండలం పెదశీతనపల్లి, నర్సింగపేట, చూటూరులో అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వార్డు వలంటీరు వ్యవస్థ ద్వారా ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు నేరుగా వారి ఖాతాలకే చేరాయన్నారు. తమది పేదల పక్షాన నిలిచే పార్టీయని ఆయ స్పష్టం చేశారు. గతంలో డ్వాక్రా, రైతు రుణ మాఫీ పేరుతో చంద్రబాబు అక్కా,చెల్లెమ్మలు, రైతులను వంచనకు గురిచేశాడని, జగనన్న హయాంలో వైఎస్సార్ ఆసరా ద్వారా డ్వాక్రా రుణాలు మాఫీ అయ్యాయని, రైతులకు రైతు భరోసా కింద ఆర్థికసాయం అందించామన్నారు.పెదశీతనపల్లిలో గతంలో పలువురు కాళ్లవాపు వ్యాధి బారినపడితే మృతులు కుటుంబాలకు ఆర్థికసాయం చేయడంతో పాటు వ్యాధి నివారణకు శాస్వత చర్యలు చేపట్టినట్లు అనంతబాబు తెలిపారు. పెదశీతనపల్లి, రామన్నపాలెం, ముకునూరు పంచాయతీల్లో సంక్షేమం నిమిత్తం 2,150 మంది లబ్దిదారులకు రూ 15 కోట్లు, అభివృద్ధి పనుల నిమిత్తం రూ 7.20 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగేందుకు రానున్న ఎన్నికల్లో మరోమారు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని , జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజీ, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, సత్యకుమారి, మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, నాయకులు శ్యాంప్రసాద్, ప్రవీణ్, విష్ణుకుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మోతుగూడెం: ఎమ్మెల్సీ అనంతబాబు చింతూరు మండలం పొల్లూరులో శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించి మరోమారు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని దీవించారు. ఈ సందర్భంగా అనంతబాబు మాట్లాడుతూ మోతుగూడెం పంచాయతీలో సంక్షేమ పథకాల నిమిత్తం రూ 9.50 కోట్లు, అభివృద్ధి పనుల నిమిత్తం రూ 3.50 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీ అభ్యర్థి తనూజరాణిని ఫ్యాను గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ సీత, నాయకులు శ్రీను, పాపారావు, శివరామకృష్ణ, త్రిమూర్తులు, పార్వతి, రమాదేవి పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి

- వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం
- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి మరోసారి సీఎంను చేయాలన్న లక్ష్యంతో ప్రజలు ఉన్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని ఆకూరు, పెదగెద్దాడ, వేములకొండ, ముసురుమిల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మన్యంలో మూడోసారి పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. ఆకూరు లాంటి మారుమూల గిరిజన పల్లెకు సచివాలయాన్ని తెచ్చి అనేక ప్రభుత్వ సేవలను గిరిజనుల ముంగిటకు తీసుకువచ్చిందన్నారు. గతంలో పింఛనుకోసం గిరిజనులు 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయానికి రావాల్సి ఉండేదన్నారు. ఇప్పుడు ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీతో వృద్ధులు, వికలాంగులకు అవస్థలు తప్పాయన్నారు.ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు బొజ్జయ్య, పండుదొర, ఎంపీటీసీ వంశీ, పార్టీ నాయకులు రామకృష్ణదొర, సుధీర్, రాంబాబు పాల్గొన్నారు.

విశాఖలో ఉర్రూతలే !

- వైఎస్సార్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌కు ఏర్పాట్లు
- నేడు డీసీ, సీఎస్‌కే మధ్య మ్యాచ్
- నెట్స్‌లో చెమటోడ్చిన ఇరుజట్లు

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) విశాఖ నగరానికి మళ్లీ వచ్చేసింది. వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లు తలపడనున్నాయి. విజయపరంపరను కొనసాగించేందుకు సీఎస్‌కే పట్టుదలగా ఉండగా హోమ్‌గ్రౌండ్‌లో విజయంతో శుభారంభం చేయడానికి డీసీ జట్టు ప్రణాళిక రచించింది. 2019 ఐపీఎల్ సీజన్ నాకవుట్‌లో క్వాలిఫైయిర్ మ్యాచ్ విశాఖ వేదికగా జరగ్గా ముఖాముఖీ పోరులో డీసీపై సీఎస్‌కే జట్టు విజయం సాధించిన విషయం విదితమే. మళ్లీ ఇప్పుడు మ్యాచ్ జరగనుండడంతో మైదానంలో ప్రత్యక్షంగా మ్యాచ్ చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపిస్తున్నారు. శనివారం ఇరు జట్ల ప్లేయర్లు గ్రౌండ్‌లో సుదీర్ఘ సమయం సాధన చేశాయి. గంటలోనే మ్యాచ్ టికెట్లు అమ్ముడుపోగా శనివారం సైతం ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఫిజికల్ టికెట్లుగా స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా అభిమానులు రిడీమ్ చేసుకున్నారు. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా సీఎస్‌కే జట్టు ఫ్రాంచైజీ అధినేతతో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్ రెడ్డి, నగర సీపీ రవిశంకర్ కాసేపు ముచ్చటించారు. మ్యాచ్ ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి చర్చించారు.


సాధన చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు


సీఎస్‌కే జట్టు సభ్యుల సాధన

ఐపీఎల్ మ్యాచ్‌కు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం జరగనున్న మ్యాచ్‌కు స్టేడియం వైపు ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలలో ప్రయాణించాలని సూచించారు.

సవాళ్లను అధిగమిస్తే ఉన్నత శిఖరాలు

- యాక్సిస్ సీఈవో, ఎండీ అమితాబ్ పిలుపు
- ఘనంగా ఐఐఎంవీ 8వ స్నాతకోత్సవం

బీచ్‌రోడ్డు: సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, అప్పుడే ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ సీఈవో, ఎండీ అమితాబ్ చౌదరి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఐఐఎం విశాఖపట్నం 8వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అమితాబ్ మాట్లాడుతూ జీవితంలో పరిమితులను పెట్టుకోకూడదని విద్యార్థులకు సూచించారు. సత్తా కలిగిన వారికి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. రానున్న రోజుల్లో భారత దేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగబోతుందన్నారు. డిజిటల్ లావాదేవీల్లో భారత్ టాప్‌లో ఉందని చెప్పారు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వాళ్లు రిస్క్ తీసుకోని,అధిగమించి విజయం సాధించాలన్నారు. ఐఐఎం విశాఖపట్నం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి ఎస్.భారతియా మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఉపాధి మార్గాలపైనే కాకుండా సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. దేశంలో మానవ వనరులు ఉన్నప్పటికీ.. తయారీ రంగంలో భారత వాటా చాలా తక్కువగా ఉందన్నారు. ఐఐఎం విశాఖపట్నంలో గడిచిన నాలుగేళ్లలో 144 స్టార్టప్‌లు రూపకల్పన చేయగా.. అందులో 112 మహిళలు స్థాపించడం అభినందనీయమన్నారు. ఇందులో సమాజాన్ని ప్రభావితం చేసే 35 స్టార్టప్‌లు ఉండటం గమనార్హమన్నారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలో మూడోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు. రూ.10 కోట్లతో 8 కంపెనీల భాగస్వామ్యంతో అటల్ ఇంకుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఏడాది కొత్తగా ఓ ఎంబీఏ కోర్సు ప్రవేశపెట్టామని, హైబ్రిడ్ మోడ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును ప్రవేశపెట్టిన రెండో ఐఐఎంగా విశాఖపట్నం నిలిచిందన్నారు.

8 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం

పీజీపీ ప్రోగ్రాంలో 267 మంది ఉత్తీర్ణత సాధించగా.. వీరిలో అంకిత్ శెట్టి(మొదటి ర్యాంక్), దుశ్యాంత్ గుప్తా(రెండో ర్యాంక్) గోల్డ్ మెడల్స్ సాధించారు. వాణి రా మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సాంగి, ఆల్ రౌండర్ గోల్డ్ మెడల్‌ను దుశ్యాంత్ గుప్తా అందుకున్నారు. పీజీపీఈఎక్స్ ప్రోగ్రాంలో 17 మంది ఉత్తీర్ణత సాధించగా గల్లా సత్య అప్పారావు(మొదటి ర్యాంక్), వి.అభిమన్యు(రెండో ర్యాంక్) గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. పీజీపీడీజీఎం ప్రోగ్రాంలో 16 మంది ఉత్తీర్ణత సాధించగా.. సుశాంత్(మొదటి ర్యాంక్), లోకేష్(రెండో ర్యాంక్)కు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- మర్రిపాకలలో రామ్ లక్ష్మణ్ టేకు చెట్లను పరిశీలించిన పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి
- కాలినడకన అటవీ ప్రాంతంలో పది కిలోమీటర్ల మేర ప్రయాణం
- అగ్ని ప్రమాదాలను నివారణకు సూచనలు
- టేకు ప్లాంటేషన్ల పరిశీలన

కొయ్యూరు/ గూడెంకొత్తవీధి: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ రాష్ట్ర ముఖ్య సంరక్షణ అధికారి (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు)(పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి అన్నారు. కొయ్యూరు, గూడెం కొత్తవీధి మండలంలోని అటవీ ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఇందులో భాగంగా గూడెంకొత్తవీధి మండలంలో కుంకుంపూడి, అగ్రహారం మీదుగా ఆయన మర్రిపాకల చేరుకున్నారు. జెర్రిగొంధి నుంచి మర్రిపాకల వరకు నాలుగు కిలోమీటర్ల దూరం ఆయన నడిచారు. అక్కడకు మరో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామ్ లక్ష్మణ్ చెట్లను పరిశీలించారు. ఆయా చెట్లలో రాముడు టేకు చెట్టు ఎండిపోయినట్టు గుర్తించారు. ఈ చెట్టు వయస్సు సుమారు 140 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ ప్రాంతంలో 53 టేకు ప్లాంటేషన్‌ల ఉన్నాయని, మరింత సిబ్బందిని పెంచాలని డీఎఫ్‌వో సూర్యనారాయణకు సూచించారు. అక్కడి నుంచి ఆయన గూడెం కొత్తవీధి మండలంలోని కొత్తబంధ, పాటిప చప్పగెడ్డ, మల్లిగూడ ప్రాంతాల్లోని టేకు ప్లాంటేషన్‌లను పరిశీలించారు.స్మగ్లర్ల బారిన పడకుండా వాటిని రక్షించాలని ఆయన సూచించారు. గిరిజరనులతో మమేకం అయి వారి సహకారంతో అటవీ రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం ఆయన వెదురు నగరంలోని వెదురు డిపోను పరిశీలించారు. పర్యటనలో ఆయన వెంట విశాఖ సర్కిల్ సీసీఎఫ్ శ్రీకాంత్‌నందరెడ్డి, విశాఖ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం, ఆర్‌వీ నగర్ సబ్ డీఎఫ్‌వో బెర్నడ్ రాజు, వివిధ రేంజ్‌ల అధికారులు, అటవీ సిబ్బంది ఉన్నారు.


రాముని చెట్టు కొలతను చేస్తున్న అటవీ సిబ్బంది


నడచి వస్తున్న పీసీసీఎఫ్ ఇతర అధికారులు